క్లుప్తంగా

ఐకేపీ ఏపీఎంగా శ్రీనివాస్



ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్

నక్కపల్లి: ఇందిరా క్రాంతి పథం(ఐకేపీ) ఏపీఎంగా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఇదే మండంలో పనిచేస్తూ ఏజెన్సీకి బదిలీపై వెళ్లారు. తాజాగా తిరిగి నక్కపల్లి మండల ఏపీఎంగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల పరిపుష్టికి తనవంతు కృషి చేస్తానన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలతో సంఘాల స్వయం ఉపాధి కార్యక్రమాలు నిర్వహించి, ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా చర్యలు చేపడతానన్నారు. డ్వాక్రా సంఘాలు, గ్రామైక్య సంఘాలు, మండల మహిళా సమాఖ్యలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఏపీఎం శ్రీనివాస్‌ను పలువురు సీఏలు, డ్వాక్రా సంఘాల అధ్యక్షులు కలిసి అభినందనలు తెలిపారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

అచ్యుతాపురం(మునగపాక): టీడీపీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలు దృష్టి సారించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కోరారు. అచ్యుతాపురంలోని ఓ ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీ నేతలు లాలం భవాని, పప్పల చలపతిరావు, పలు మండలాల పార్టీ నేతలు, కార్యకర్తలు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొమ్మాయి గుండం చెరువు గట్టుకు ఆనుకుని ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను గురువారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రారంభించారు. భోజనం చేయడానికొచ్చిన వారికి ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌లు స్వయంగా ఆహార పదార్థాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, వార్డు కౌన్సిలర్లు, పలువురు అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక: వాడ్రాపల్లి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు. వాడ్రాపల్లి సచివాలయంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడ్రాపల్లిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, కూటమి నేతలు నరసింగరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

ఎస్.రాయవరం: గ్రామంలో ఈ ఏడాది చేపట్టబోయే అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. కర్రివానిపాలెం గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గతేడాదిలో గ్రామంలో చేపట్టిన పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి హేమలత, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి వరహాలరావు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సభ్యత్వాలు చేపట్టాలి

పాయకరావుపేట: నియోజకవర్గంలో చురుగ్గా బీజేపీ సభ్యత్వాలు చేపట్టాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కోరారు. ఆయన పాయకరావుపేటలో గురువారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ పార్టీ సభ్యత్వాల నమోదు చురుగ్గా సాగాలన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు దారపు పరమేశ్వరరావు, పాకలపాటి రవిరాజు, కర్రి చట్టిబాబు, గెడ్డం బుజ్జి, శ్రీరంగం రమేష్, మేముల రమణ, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన దుర్గమ్మ

- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- డప్పు వాయిద్యాల నడుమ విగ్రహాల ఊరేగింపు, ప్రతిష్ట



మునగపాక లింగరాయి గుడిలో పూజలు చేస్తున్న భక్తులు



మునగపాకలో దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



కైలాసపట్నంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



మూలపేటలో దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆధ్యాత్మిక గాయత్రీ జ్ఞాన పీఠంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితుడు



మునగపాకలో దుర్గాదేవి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



హరిపాలెం-అందలాపల్లి దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా దుర్గమ్మ కొలువుదీరింది. ముందుగా ఉదయం నుంచి మండలంలోని గ్రామాల్లో యువకులు, మాలలు ధరించిన భక్తులు ఉత్సాహంతో అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం పీటకాల్లో అమ్మవారిని ప్రతిష్ఠింపచేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయాల్లోనూ, మండపాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. జై దుర్గా.. జైజై దుర్గా అంటూ భక్తులు నినదించారు. డప్పు వాయిద్యాలకు అనుగుణంగా భక్తులు నృత్యం చేశారు. పంచాయతీ వీధిలోని ఆలయంలో పురోహితుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కళశాలకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అచ్యుతాపురం(మునగపాక): మండల వ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలను పలు చోట్ల ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి మాలలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిపాలెం-అందలాపల్లి కొండపై ఉన్న అమ్మవారిని, అలాగే హిమగిరి కొండపై కొలువుదీరిన శ్రీవిజయదుర్గ అమ్మవారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆయా దేవాలయాల్లో పలువురు భక్తులు మాలధారణ చేశారు.



ఎస్.రాయవరంలో ఊరేగింపుగా అమ్మవారిని తీసుకెళ్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: భక్తులతో పూజలందుకునేందుకు ఊరూరా దుర్గామాత కొలువుదీరారు. పట్టణంలోని గాంధీనగరం ఆధ్యాత్మిక గాయత్రీ జ్ఞానపీఠంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఇక్కడ తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు లలితా పారాయణం, పూజ నిర్వహించారు. గాంధీనగరం మొదటి వీధి, మిలట్రీ కాలనీ, ధర్మవరం, కాకివాని వీధి, కొక్కిరాపల్లి రైల్వేగేటు దగ్గర, రాంనగర్, ఎర్రవరం, పెదపల్లి, కొక్కిరాపల్లి, సోమలింగపాలెం, కొత్తపాలెం, జంపపాలెం, ఏటికొప్పాక, పీఎస్ఆర్ పేట, పులపర్తి, కృష్ణాపురం, రేగుపాలెం, లైనికొత్తూరు తదితర గ్రామాల్లో ప్రత్యేక పందిళ్ల ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించారు. పీఎస్ఆర్‌పేట దుర్గమ్మ ఆలయంలో మాలధారణ చేసిన భవానీ భక్తులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఇక్కడ అమ్మవారి విగ్రహాన్ని అందంగా అలంకరించారు.

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో భవానీ భక్తులు అధిక సంఖ్యలో ఊరేగింపుగా అమ్మవారిని తీసుకెళ్లి కర్రివీధిలో దుర్గమ్మ గుడివద్ద ప్రతిష్టించారు. ఈ సందర్భంగా వీధులను వేపాకులు, పసుపు నీళ్లతో శుభ్రం చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేలా తీర్చిదిద్దారు. పి.ధర్మవరం, అడ్డురోడ్డు, పెదగుమ్ములూరు, దార్లపూడి గ్రామాల్లో దుర్గమ్మ ప్రతిమలను ప్రతిష్టించి పూజలు చేశారు. తొలిరోజు గురువారం బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో దుర్గమ్మ దర్శనమిచ్చింది.

కోటవురట్ల: మండలంలో లింగాపురం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి విగ్రహాన్ని తీసుకెళ్లారు. సుంకపూరు గ్రామంలో భవానీ భక్తులు ఊరేగింపు నిర్వహించారు. కైలాసపట్నంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సిద్దాబత్తుల నాగేశ్వరావు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పాయకరావుపేట: మండలంలో శరన్నవరాత్రి వేడుకల సందడి ప్రారంభమైంది. పాయకరావుపేటలోని దుర్గాలమ్మ చెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాంబిక ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి మండపాల్లో ప్రతిష్టించారు.



పీఎస్ఆర్ పేటలో ప్రత్యేక అలంకరణలో జగన్మాత



పెదగుమ్ములూరులో బాలత్రిపురసుందరి దేవీగా దుర్గమ్మ



లింగాపురం నుంచి ర్యాలీగా వచ్చిన భవానీ భక్తులు



పాయకరావుపేట దుర్గాలమ్మ చెట్టుకి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పాయకరావుపేటలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

భవానీల భిక్షకు విశేష స్పందన



కల్యాణ మండపంలో భిక్ష స్వీకరిస్తున్న భవానీ భక్తులు

నక్కపల్లి: స్థానిక టీఎస్ఆర్ హెటిరో కల్యాణ మండపంలో భవానీ దీక్షలు చేపట్టిన భక్తులకు ఏర్పాటు చేసిన భిక్షకు విశేష స్పందన లభిస్తోంది. దాతల సహకారంతో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ తదితరులు ఇక్కడ భవానీ దీక్షాపరులకు పది రోజుల పాటు భిక్ష ఏర్పాటు చేయడం తెలిసిందే. పలువురు దాతలు, భవానీ భక్తులు సహకారంతో బుధవారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గురువారం నక్కపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

మద్యం షాపుల కోసం దరఖాస్తుల స్వీకరణ

పాయకరావుపేట: కొత్త మద్యం పాలసీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఒకటి నుంచి ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందన్నారు. అప్లికేషన్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ధారించిందన్నారు. ఈ ఫీజు తిరిగి చెల్లించరని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు షాపులను లాటరీ విధానం ద్వారా తీసి, కేటాయిస్తారన్నారు. ఈ నెల 11న అనకాపల్లిలోని ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో లాటరీ తీస్తామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



ఎరిపల్లి మహాలక్ష్మి

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం పూడిమడక పంచాయతీ పెద్దూరుకు చెందిన వృద్ధుడు ఎరిపల్లి మహాలక్ష్మి అదృశ్యంపై గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలిలా ఉన్నాయి. మహాలక్ష్మి గత నెల 29న ఇంటి వద్ద టీ తాగి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలించారు. మహాలక్ష్మి అప్పుడప్పుడు చేపలు పట్టే వైరుతో మంచాలు అల్లేందుకు కశింకోట మండలం తాళ్లపాలెం, కన్నూరుపాలెం, రావికమతం తదితర ప్రాంతాలకు వెళ్లేవాడని, ఆయా ప్రాంతాల్లో కూడా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అచ్యుతాపురం పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గణేష్ తెలిపారు.

విధిగా పూజా కార్యక్రమాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి అప్పారావు

అచ్యుతాపురం(మునగపాక): మండలంలోని హరిపాలెం-అందలాపల్లి భరీగదమ్మ ఆలయంలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి కొల్లి అప్పారావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భజనలు, ఏకాదశి నాడు నగర సంకీర్తన, రెండో శనివారం సత్సంగం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి పౌర్ణమికి సామూహిక హారతి కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ నెల 9న మునగపాకలో గ్రామ కన్వీనర్లకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రమణ, చోడపల్లి సత్యం, భీశెట్టి శ్రీదేవి, భీశెట్టి గణేష్, జగ్గన్నపేట సర్పంచ్ దొడ్డి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చదువులో ఏకాగ్రత అవసరం



మాట్లాడుతున్న మునగపాక హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు

మునగపాక: విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలంటే చదువులో ఏకాగ్రత చూపించాలని మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు సూచించారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన గురువారం హైస్కూల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలని, తద్వారా పోటీ పరీక్షల్లో రాణించగలమన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ఎం.సత్యనారాయణమూర్తి, సంస్థ సభ్యులు మాడెం జోగారావు, ఎం.వై.రాము, పిల్లా జగదీష్ పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం



రాట్నాలపాలెం మెయిన్ రోడ్డులో మదుం లేకుండా ప్రమాదకరంగా ఉన్న గెడ్డ ప్రాంతం

కోటవురట్ల: రాట్నాలపాలెం మెయిన్ రోడ్డులో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. గ్రామం మధ్యలో మెయిన్ రోడ్డు మీదుగా ఉన్న గెడ్డపై రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో ఏమాత్రం ఆదమరిచినా సుమారు 15 అడుగుల లోతున్న గెడ్డలో పడిపోయే అవకాశం ఉంది. నర్సీపట్నం నుంచి అడ్డురోడ్డు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రెండు వైపులా రక్షణ గోడ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

- రేంజ్ అధికారి అనిల్‌కుమార్
- వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ, కరపత్రాల పంపిణీ



యలమంచిలిలో ర్యాలీ చేస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది

యలమంచిలి రూరల్: ఈ భూమిపై మనకు జీవించే హక్కు ఎలా ఉందో.. అలాగే ప్రతి జీవికీ ఉందని, జనావాసాలకు దూరంగా అడవుల్లో నివసించే వన్యప్రాణులకు హాని తలపెట్టకూడదని యలమంచిలి అటవీ పరిధి అధికారి జి.అనిల్‌కుమార్ అన్నారు. జాతీయ వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా గురువారం యలమంచిలి పట్టణంలో అటవీ అధికారులు, సిబ్బంది స్థానిక అటవీ పరిధి కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి వరకు ర్యాలీ చేపట్టారు. బ్యానర్లు ప్రదర్శించి, స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. వన్యప్రాణులను రక్షించే బాధ్యత అందరూ తీసుకోవాలని అనిల్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి బీవీ రమణ, బీట్ అధికారులు పాల్గొన్నారు.

వరినాట్లు సరే.. ఎరువులెక్కడ?

- ఆర్‌బీకేల్లో ఎరువుల కొరత
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతుల మండిపాటు



ఏపుగా పెరిగిన వరిపైరు



అడ్డురోడ్డు గ్రోమోర్ ఎరువుల దుకాణం వద్ద బారులు తీరిన రైతులు

ఎస్.రాయవరం: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేనట్టుగా ఉంది రైతుల పరిస్థితి. ఈ ఏడాది ఖరీఫ్‌కు సిద్ధమైన రైతులకు వరుణుడు కరుణించి విస్తారంగా వర్షాలు పడినప్పటికీ.. ప్రభుత్వం నుంచి అందాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అరకొర సరఫరాతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు సకాలంలో కురవడంతో ఎస్.రాయవరం మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు ముందుగా వెళ్లిన వారికే విత్తనాలు దొరికాయి. ఆ తరువాత నాట్లు వేద్దాము అనుకున్నవారికి విత్తనాలు లేవని చెప్పడంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుగోలు చేసుకున్న పరిస్థితి తలెత్తింది. ఆ తరువాత కాలానికి అనుగుణంగా వర్షాలు కురవడంతో వరిపైరు ఏపుగా పెరిగి ప్రస్తుతం ఆశాజనకంగా కనిపిస్తోంది. అయితే పైరుకు అవసరమైన ఎరువులు స్థానికంగా ఉండే రైతు భరోసా కేంద్రాల్లో లభ్యం కాకపోవడంతో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ధరలు పెంచి విక్రయిస్తున్నట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండలంలోని 28 పంచాయతీలకు 22 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు కోరిన ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేవారు. ఇప్పుడు అటువంటి సేవలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. రైతుకు పెట్టుబడి సమయంలో గత ప్రభుత్వం రైతు భరోసా సహాయం అందించి ఆదుకునేదని, సాగు మొదలై రెండు నెలలైనా చంద్రబాబు ఇస్తానన్న రైతు సహాయం రూపాయి కూడా ఇవ్వలేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమర్శిస్తున్నారు.

ఆర్‌బీకేల్లో ఎరువుల కొరత



గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా చేయలేదు. ఇప్పుడు అవసరమైన ఎరువులు కూడా దొరకడం లేదు. నాట్లు వేసిన తరువాత ఎరువులకు, పురుగు మందులకు యలమంచిలి, ఎస్.రాయవరం ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. గతంలో ఆర్‌బీకేల్లో మొదటి రోజు చెబితే ఒకటి, రెండు రోజుల్లో అందుబాటులోకి అవసరమైన ఎరువులు తీసుకువచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– కాసెపు అప్పన్న, రైతు, సర్వసిద్ధి

అడిగిన ఒకటి, రెండు రోజుల్లో ఎరువుల సరఫరా



గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నాం. రైతులు అడిగిన ఒకటి, రెండు రోజుల్లో ఎరువులు అందిస్తున్నాం. రైతులు అడిగిన అన్ని రకాల ఎరువులు సరఫరా చేయలేకపోతున్నాం తప్ప, కొన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచుతున్నాం. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణానికి మించి 10 శాతం అదనం నాట్లు వేశారు. దీంతో విత్తనాలకు డిమాండ్ పెరిగింది. చివరిలో నాట్లు వేసిన రైతులకు విత్తనాలు అందించలేకపోయాం.

– సౌజన్య, మండల వ్యవసాయాధికారి, ఎస్.రాయవరం

తారెత్తిస్తున్న టమాటా

- కిలో రూ.80

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర తారెత్తించింది. కిలో రూ.80కి పెరిగింది. గత వారం కిలో రూ.60 ఉండగా, ఈ వారం అదనంగా రూ.20 పెరిగింది. ఇంకా త్వరలోనే రూ. వందకు పెరగనుందని వ్యాపారులంటున్నారు. ఉల్లి కూడా బెట్టు మీదే ఉంది. కిలో రూ.60కి విక్రయించారు.

బంగాళదుంప, బెండకాయ ఎప్పటిలాగే రూ.40, వంకాయ, క్యారెట్, బీట్‌రూట్, బీరకాయ రూ.60, గోరు చిక్కుడు రూ.80, ఆగాకర, పాదు చిక్కుడు రూ.వందకు అమ్మకాలు సాగాయి.

6న నాటికల ప్రదర్శన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రంగస్థల నటుడు కొండలరావు

మునగపాక: మునగపాక నందీశ్వర కళా ప్రాంగణంలో ఈ నెల 6న జరగనున్న నాటిక ప్రదర్శనలను విజయవంతం చేయాలని రంగస్థల నటుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టెక్కలి కొండలరావు కోరారు. ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్, దివంగత నేత పెంటకోట జనరాజ్‌దాస్ జయంతిని పురస్కరించుకుని ఈ రెండు నాటికల ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మేరకు గురువారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన పీఏసీఎస్ ఆవరణలో ఆవిష్కరించారు. రాత్రి 7 గంటలకు క్రీ నీడ, తరువాత విముక్తి నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, పెద్దలు పెంటకోట వెంకటరావు, కోనపల్లి రామ్మోహనరావు, పెంటకోట వెంకట్, ఎంఎం నాయుడు, మళ్ల కృష్ణ, ఆడారి సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.